

బీఎస్పీలో చేరికలు

మంచిర్యాల క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా కేంద్రం లో బహుజన సమాజ్ పార్టీలో యువకులు భారీగా చేరారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర నాయకులు కాదాసి రవిందర్, జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్ యువకులకు కండువా కప్పి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవిందర్, దాగం శ్రీనివాస్, నాగుల కిరణ్ బాబు, బూడిద మల్లేష్ పాల్గొన్నారు.

సీసీ రహదారి పనులు ప్రారంభం

నస్పూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం 21వ వార్డు అల్లూరి సీతా రామరాజు నగర్‌లో డీఎంఎఫ్‌టీ నిధులు రూ. 12 లక్షల వ్యయంతో నిర్మించే సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు వార్డులో పర్యటించినప్పుడు స్థానికులు రోడ్డు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నిధులు మంజూరు కావడంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను వార్డు ఇన్‌చార్జి ధరణి మధుకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గోపతి తిరుపతి, కొమ్మ నగేష్, రాజేష్, రమేష్, శంకర్ పాల్గొన్నారు.

సదరం శిబిరాన్ని పారదర్శకంగా నిర్వహించాలి




సిబ్బందికి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల నూతన ధ్రువ పత్రాలు, పునరుద్ధరణ కోసం సదరం శిబిరాన్ని పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్న సదరం శిబిరాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 1,3,4,6,7,10,11,12,13,14 తేదీల్లో లోకోమోటార్/ఆర్థో, 17,18 తేదీల్లో వినికిడి లోపానికి సంబంధించి ప్రతి రోజు 75 మందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. దివ్యాంగులు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు. క్యాంపు నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, వసతులు కల్పించాలని సూచించారు. ఆయన వెంట డీఆర్‌డీవో కిషన్, ఆర్ఎంవో సుధీర్, డాక్టర్‌రాజేష్, డీపీఎం అన్నాజీ, ఏపీఎం రాజ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

సిమెంటు పరిశ్రమలకు ప్రోత్సాహమేదీ..?

- ఉమ్మడి జిల్లాలో పుష్కలంగా సున్నపురాయి నిల్వలు
- ఇప్పటికే పలు కంపెనీల మూసివేత
- రోడ్డున పడుతున్న వేలాది మంది కార్మికులు
- దేవాపూర్ ప్లాంటు యాజమాన్యం మార్పు



మూసివేసిన మంచిర్యాల సిమెంటు కంపెనీ

మంచిర్యాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని సిమెంటు పరిశ్రమలకు ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం లేక యాజమాన్యాలు అల్లాడుతున్నాయి. ఇప్పటికే పలు కంపెనీలను మూసి వేయగా మరికొన్ని ప్లాంట్‌ల యాజమాన్య మార్పిడి జరిగింది. సిమెంటు తయారీకి ముడి సరుకు అయిన సున్నపు రాయి నిల్వలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పుష్కలంగా ఉన్నప్పటికీ కర్మాగారాలు స్థాపించేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో ఇక్కడి యువతకు ఉద్యోగావకాశాలు లభించడం లేదు. ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం కరువై సిమెంటు కర్మాగారాలు మూసివేతకు గురవుతుండగా, వాటిలో పని చేసే కార్మికులు రోడ్డున పడుతున్నారు.

పుష్కలంగా నిల్వలు..

సిమెంటు తయారీకి ముడి వనరు అయిన సున్నపు రాయి నిల్వలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పెట్టింది పేరు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాసిపేట మండలం దేవాపూర్, హాజీపూర్ మండలం ర్యాలీ ఘడ్‌పూర్, తిర్యాణి మండలం కెరమెరితోపాటు ఆదిలాబాద్, బేల మండలాల్లోని ఏజెన్సీ ప్రాంత గుట్టల్లో సున్నపు రాయి నిల్వలున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాసిపేట మండలం దేవాపూర్‌లో ఒకే ఒక్క సిమెంట్ పరిశ్రమ కార్మికులకు ఉపాధి కల్పిస్తోంది. నాలుగైదేళ్ల క్రితం వరకు మంచిర్యాల జిల్లా కేంద్రంలో మంచిర్యాల సిమెంట్ కంపెనీ (గతంలో ఏసీసీ కంపెనీగా ప్రసిద్ధి) లో ఉత్పత్తి జరుగగా, ఆ కంపెనీపై ఆధారపడి వేలాది కుటుంబాలు ఉపాధి పొందాయి. మంచిర్యాల సిమెంటు కంపెనీలో ఉత్పత్తికి అవసరమైన సున్నపు రాయి హాజీపూర్ మండలంలోని ర్యాలీ గ్రామంలో ఉన్న గుట్టల నుంచి సేకరించేవారు. రిజర్వు ఫారెస్టులో క్వారీలు ఏర్పాటు చేసి, అక్కడి నుంచి ప్రత్యేక రోప్ వే ద్వారా ముడి సరుకును ప్లాంట్‌కు తరలించే వారు. సున్నపురాయి తవ్వేందుకు కంపెనీ యాజమాన్యానికి 2019 వరకు లీజ్ అనుమతులు ఉండగా, అంతకు ముందే యాజ మాన్యం ఉద్దేశ్యపూర్వకంగా ఉత్పత్తి నిలిపివేసే పన్నాగాలు పన్నింది. ఇదిలా ఉంగా కాసిపేట మండ లం దేవాపూర్‌లోని ఓరియంట్ సిమెంటు కంపెనీకీ కూడా అవరమైన ముడి సరుకును ఏజెన్సీ ప్రాంతంలోని దేవాపూర్, ర్యాలీ గడ్‌పూర్, కెరమెరి గుట్టల నుంచి తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఎండీసీ) ద్వారా పొందేది. ప్రస్తుతం దేవాపూర్ సిమెంట్ కంపెనీకి సుమారు మరో 15 సంవత్సరాల వరకు సున్నపు రాయి తరలించే లీజ్ అనుమతులు ఉన్నాయి.

పలు కంపెనీలు మూసి వేత..

ప్రభుత్వ ప్రోత్సాహం కరువై ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పలు సిమెంటు కర్మాగారాలు మూసివేతకు గురయ్యాయి. ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ రంగ సంస్థ అయిన సీసీఐ (సిమెంట్ కంపెనీ ఆఫ్ ఇండియా) దాదాపు 20 ఏళ్ల క్రితం మూతపడగా ఆసిఫాబాద్ మండలం దంతెన పల్లిలోని అన్నపూర్ణ సిమెంట్స్, సోమేశ్వర సిమెంటు కంపెనీలు శాశ్వతంగా మూతపడ్డాయి. కొమురం బీం ప్రాజెక్ట్ నిర్మాణం కారణంగా సోమేశ్వర, అన్నపూర్ణ సిమెంటు కంపెనీలు మూసివేతకు గురయ్యాయి. సున్నపురాయి..

తరువాయి 7లో..

రివిజన్ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం హైద్రాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2002 ఎలక్టోరల్ జాబితానియోజకవర్గాల వారీగా 2025 ఎలక్టోరల్ జాబితా మ్యాపింగ్ చేసి నాలుగు కేటగిరీలుగా విభజించామన్నారు. మొదట కేటగిరి ఏ జాబితాను బీఎల్‌వో యాప్ ద్వారా నిర్ధారించుకుంటామన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 63 లక్షల ఓటర్లను నిర్ధారించామని, మిగిలిన 12 లక్షల ఓటర్ల నిర్ధారణ త్వరగా పూర్తి చేయాలన్నారు. కేటగిరి సీ, డీలలోని ఓటర్లను కేటగిరీ ఏ కు మ్యాపింగ్ చేసే ప్రక్రియను మెరుగు పర్చాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ బీఎల్‌వోలు, సూపర్‌వైజర్ల ద్వారా కేటగిరి ఏ ఓటరు జాబితాను బీఎల్‌వో యాప్ ద్వారా నిర్ధారించి కేటగిరి సీ, డీలను ఏకు అనుసంధానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ చంద్రకళ, ఆర్డీవో శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

లక్షెట్టిపేట, నవంబరు, 1(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుని కేసులను పరిష్కరించుకోవాలని లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జ్ సాయి కిరణ్ కసలమ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీన లక్షెట్టిపేట న్యాయస్థానంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తామని కక్షిదారులు తమ విలువైన సమయం వృథా చేసుకోకూడదని కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడకూడదన్నారు. లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్ కేసులతో పాటు చెక్‌బౌన్స్, మనీ రికవరీ, ఆక్సిడెంట్, మ్యారేజ్ తదితర కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉందని కక్షిదారులు ఈ విషయం గమనించి న్యాయసేవాధికార సంస్థ కల్పించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి కోరారు.

మౌలిక వసతుల వివరాలను నమోదు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాల క్రైం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రీ ప్రైమ రీ నుంచి ఇంటర్ విద్యను అందించే ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ కళాశాల సమగ్ర వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని డీఈవో యాదయ్య అన్నారు. ఈ సందర్భంగా సీఆర్‌పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు యూడైస్ ప్లస్ పై నిర్వహించిన ఒక రోజు కార్యక్రమంలో ఆయన కళాశాల యాజమాన్యాలకు వివరాలను వెల్లడించారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల సమగ్ర వివరాలను వెబ్ సైట్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎం భరత్‌కుమార్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ కోఆర్డినేటర్ రాజ్ కుమార్, సమగ్ర కోఆర్డినేటర్ చౌదరి, పాల్గొన్నారు.

రోడ్డు భద్రత ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలి

మంచిర్యాల డీసీపీ భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

మందమర్రిటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రత ప్రతీ ఒక్క రి బాధ్యత అని ప్రతీ ఒక్కరు నిబంధనలు పాటించడం ద్వారా ఎలాంటి ప్రమాదాలు జరగవని మంచిర్యాల డీసీపీ భాస్కర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని యాపల్ ఏరియాలో మందమర్రి పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన సదస్సుకు డీసీపీ హాజరై మాట్లాడారు. ఇటీవల కాలంలో చాలా మంది తల్లిదండ్రులు పిల్లలకు వాహ నాలను ఇస్తూ సంతోషపడుతున్నా రని, అనుకోకుండా వారు రోడ్డు ప్రమా దాలకు గురై ఒకానొక సందర్భంలో ప్రాణాలు కోల్పోవడంతో పాటు తీవ్ర గాయాలతో ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు.

18 ఏళ్లలోపు వారికి వాహనాలు ఇవ్వవద్దన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడంతో అనేక ప్రమాదాలు జరిగి మృతిచెందుతున్న సంఘటనలు ఉన్నాయన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదం జరిగితే ప్రాణాలు కాపాడుకోవచ్చన్నారు. మద్యం సేవించి మితిమీరిన వేగంతో నడపడం ప్రమాదకర మన్నారు. ప్రమాదాల నివారణకు పోలీసు కళాకారులతో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. 17 మంది రోడ్డు ప్రమాదంలో మృతిచెందారని, యాపల్ అంగడి బజార్ ఏరియాలోని జాతీయ రహదారిపై ఏడుగురు మృతిచెందడం బాధాకరమన్నారు. మైనర్లకు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. రోడ్డు భద్రత నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. పోలీసులు, రవాణా శాఖతోపాటు రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించడం శ్రేయస్కరమన్నారు. ఈ సందర్భంగా రెండేళ్లలో మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదాలను ప్రొజెక్టర్‌లో ఫొటోలను చూపించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్, పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

ఉద్రిక్తతల నడుమ రోడ్డు విస్తరణ

- పెట్రోలు పోసుకుని వీధి వ్యాపారుల ఆందోళన
- అడ్డుకున్న పోలీసులు



బెల్లంపల్లిలో బైఠాయించి రాస్తారోకో చేస్తున్న వీధి వ్యాపారులు

బెల్లంపల్లి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మున్సిపల్ అధికారులు చేపడుతున్న రహదారి విస్తరణ పనులు ఉద్రిక్తతకు దారి తీశాయి. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్దకు శనివారం ఉదయం మున్సిపల్ అధికారులు, పోలీసు బలగాలతో అక్కడకు చేరుకుని జేసీబీ సాయంతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఇష్టం వచ్చినట్టుగా విస్తరణ పనులు చేపట్టవద్దని వీధి వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ప్రత్యామ్నాయం చూపెట్టకుండా పనులు ఏ విధంగా చేపడుతారని సంబంధిత మున్సిపల్‌శాఖ అధికారులతో వాగ్వాదానికి దిగారు. పనులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీయడంతో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, సిబ్బంది చిరు వ్యాపారస్తులను అడ్డుకున్నారు. దీంతో వ్యాపారస్తులు ఆగ్రహానికి లోనై తమ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌పైన పోసుకున్నారు. అప్రమత్తమైన పోలీసులు పెట్రోలు డబ్బాలు లాక్కుని వ్యాపారస్తులను సముదాయించారు. దీంతో వ్యాపారస్తులు అంబేద్కర్ చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించి మున్సిపల్ కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళన చేస్తున్న వీధి వ్యాపారులను పోలీసులు పక్కకు తరలించారు. దీంతో అధికారులు జేసీబీ సాయంతో రోడ్డు పక్కన ఉన్న దుకాణాలను నేలమట్టం చేశారు.

సెరి కల్చర్ విజ్ఞాన యాత్ర

చెన్నూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లంబడిపల్లి గ్రామంలోని పట్టు పురుగుల పెంపకం కేంద్రాన్ని చెన్నూరులోని శార్వాణి పాఠశాల విద్యార్థులు విజ్ఞాన యాత్రలో భాగంగా సందర్శించారు. ఇందులో భాగంగా పట్టు పురుగుల పెంపకం, వాటి నుంచి సిల్క్ తయారీ వివిధ దశల్లో పట్టు పురుగులు ఎలా వృద్ధి చెందుతాయో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సెరి కల్చర్ సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ పట్నాయక్ పట్టు పురుగుల గురించి విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ శ్రావణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు మహేష్, రజిత, స్వామి, లక్ష్మీనివాస్, అనూష పాల్గొన్నారు.

గూడెం ఆలయంలో కార్తీక రద్దీ

సామూహిక వ్రతాలు, దీపారాదన పూజలు



కార్తీక దీపాలు వెలగిస్తున్న మహిళలు

దండేపల్లి నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ దశమి రెండో శనివారం పురస్కరించుకుని దండేపల్లి మండలం శ్రీసత్యనారాయణ స్వామి దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ముందుగా పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజల నడుమ గోదావరి నదిలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకొని సత్యదేవుడిని దర్శించుకొని భక్తులు ప్రత్యేక కార్తీక పూజలతో మొక్కులు చెల్లించుకున్నారు. 600మందిపైగా భక్తులు కుటుంబసమేతంగా స్వామి వ్రతాలను నోముకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని రావి చెట్టు, ప్రధానలయ ఎదుట గల ధ్వంజ స్తంభం వద్ద ఉసిరి కాయలతో కార్తీక దీపాలు వెలించి పూజలు చేశారు.



మండపంలో వ్రతాలు చేస్తున్న భక్తులు

మిషన్ భగీరథ నీరు వృథా



ఎస్ఆర్ కాలనీలో వృథాగా రోడ్డుపై ప్రవహిస్తున్న మిషన్ భగీరథ నీరు

నస్పూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం ఎస్ఎల్ఆర్ కాలనీకి సరఫరా అయ్యే మిషన్ భగీరథ మంచినీటి పైపు పగిలి మంచినీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. పదిహేను రోజుల కిందట పైపు పగిలి నీరు వృథాగా పోతోందని అధికారులకు సమాచారం ఇచ్చినా ఇప్పటి వరకు స్పందన లేదు. దీంతో భగీరథ నీరు రోడ్డుపై ప్రవహించడంతో రహదారి మొత్తం చిత్తడిగా మారుతోంది. వాటర్ ట్యాంకు ద్వారా ఇళ్లకు వచ్చే నీరు అరకొరగా వస్తుందని స్థానికులు తెలిపారు. పైపు పగిలి పోవడంతో ఉదయం వేళ నీరు వచ్చే సమయంలో రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. నల్లాల ద్వారా నీరు సరిపోక నీటి కోసం ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి పైపు లైన్‌కు మరమ్మతులు చేసి మంచినీరు పూర్తి స్థాయిలో సరఫరా అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఘనంగా సిటీన్యూరో ఆసుపత్రి వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న సిటీ న్యూరో ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని సిటీన్యూరో ఆసుపత్రి నాలుగో వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి న్యూరో వైద్యులు మల్లేష్ గంప, ఆసుపత్రి నిర్వహకుడు పిన్న ప్రశాంత్ మాట్లాడుతూ ఆసుపత్రి ప్రారంభించిన కొద్ది రోజుల్లో ప్రజాదరణ లభించడం సంతోషదాయకమన్నారు. 5వ వసంతంలో మరిన్ని సేవలందించి జిల్లాప్రజల అభిమానాన్ని చూరగొంటామన్నారు. ఇతర ప్రాంతాలకు ప్రజలు వెళ్లే అవసరం లేకుండా అన్ని రకాల పరికరాలతో అధునాతన సేవలను ఆసుపత్రిలో అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిటీన్యూరో ఆసుపత్రి యాజమాన్యం పిన్న ప్రవీణ్, గుండ అజయ్‌కుమార్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో ప్రధానిని అవమాన పరుస్తూ మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా పట్టణాధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్ కుమార్ మాట్లాడుతూ దేశ మహిళల కుంకుమను తుడిచిన పాకిస్తాన్ గుండాలపై ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్‌తో ప్రతి దాడి చేసిందన్నారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి ఉప ఎన్నికల్లో దేశ గౌరవాన్ని సైనికుల త్యాగాలను అవమానపరుస్తూ కేవలం ఒక వర్గం ఓట్లకు కొమ్ముకాస్తూ ఎన్నికల ప్రచారం చేయడం సిగ్గు చేటన్నారు. అబద్దాల హామీలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. వెంటనే రేవంత్‌రెడ్డి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రె లచ్చన్న, బింగి సత్యనారాయణ, రాకేష్ రెన్వా, అశోక్, వెంకటేశ్వర్లు,వెంకటేష్, చిరంజీవి, కుమారస్వామి, శ్రీనివాస్, రవీందర్, రాజమౌళి, సతీష్, సాయికృష్ణ, శ్రీనివాస్, మనీష్ పాల్గొన్నారు.

రైతులు నానో ఎరువులు వాడకం పెంచాలి

జిల్లా వ్యవసాయాధికారి సురేఖ

హాజీపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు నానో ఎరువుల వాడకం పెంచాలని జిలా వ్యవసాయాధికారి సురేఖ అన్నారు. మండలంలోని గుడిపేట్ రైతు వేదికలో హాజీపూర్ వ్యవసాయాధికారి కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సురేఖ మాట్లాడుతూ రసాయన ఎరువుల అయిన యూరియా, డీఏపీ ఎరువులను సాధారణ రసాయన ఎరువుల రూపంలో కాకుండా నానో అంటే ద్రవ రూపంలో వాడకం పెంచాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. తద్వారా రైతుకు పెట్టుబడి ఖర్చు తగ్గించేలా అధికారులకు అవగాహన కల్పించారు. నేషనల్ మిషన్ ద్వారా సేంద్రీయ వ్యవసాయంపై ప్రోత్సాహం కల్పించాలన్నారు. కపాస్ కిసాన్ యాప్, ఇతర పంటల అమ్మకాలకు తప్పనిసరి పంట నమోదు చేసుకోవాలని సూచించారు. మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి మండల వ్యవసాయాధికారులు, కోరమాండల్ కంపెనీ ప్రతినిధులు, నానో ఫెర్టిలైజర్ కో ఆర్డినేటర్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి సురేఖ

చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్

హసన్‌పర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగను అరెస్టు చేసి రూ.6 లక్షల విలువ చేసే 40 గ్రాముల బంగారు, 50 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు రూ.56,400 నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ తెలిపారు. శనివారం హనుమకొండ జిల్లా కేంద్రంలోని కేయూ పోలీసు స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేరుల సమావేశంలో నిందితుడి అరెస్టు చూపి వివరాలు వెల్లడించారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి తేజిగూడకు చెందిన సెండె అరుణ్‌కుమార్ 2022లో వరంగల్‌లోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో బీఎస్సీ బీజడ్‌సీ పూర్తి చేసిన తరువాత ఒక సంవత్సరం ఇంటి వద్దే ఖాళీగా ఉంటూ తల్లి దండ్రులతో జీవనం సాగించాడు. 2024లో ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు హనుమకొండకు వచ్చి గది అద్దెకు తీసుకొని చదువుకునేవాడు. ఈ క్రమంలోనే అరుణ్‌కుమార్ బెట్టింగులకు బానిసై చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక దొంగతనాలకు అలవాటు పడ్డాడు. గోపాల్‌పూర్, భీమారం ఏరియాలలో ఇంటికి తాళం వేసిన ఇళ్లను గుర్తించి రాత్రి పూట తాళాలు పగుల గొట్టి బంగారు, వెండి ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లేవాడు. నిందితుడు సుమారు 10 నేరాలు చేసినట్లు అంగీకరించినట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. ఇందులో భాగంగా నిందితుడి వద్ద 10 కేసులలో మొత్తం రూ.6 లక్షల విలువైన 40 గ్రాముల బంగారు, 50 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు రూ.56,400 నగదును రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వెల్లడించారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన కేయూసీ ఎస్సైలు పి.శ్రీకాంత్, కె.నవీన్‌కుమార్, క్రైం సిబ్బంది అహ్మద్ పాషా, రాజశేఖర్, జితేందర్, సీసీఎస్ వరంగల్ సిబ్బంది టి.మధు, బి.చందులను ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

108లో ప్రసవం


అంబులెన్స్‌లో తల్లి, బిడ్డ

కోటపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్సా గ్రామానికి చెందిన బోల్ల రజిత శనివారం 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. శుక్రవారం అర్ధరాత్రి రజితకు పురుటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా నొప్పులు అధికం కావడంతో లింగన్నపేట సమీపంలో అంబులెన్స్‌ను నిలిపివేశారు. 108 రాష్ట్ర ప్రధాన కార్యాలయం ఉన్నత వైద్యులతో ఫోన్‌లో సంప్రదిస్తూ అంబులెన్స్ సిబ్బంది సుఖ ప్రసవం చేయగా మగబిడ్డ జన్మించాడు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉండడంతో చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఈఎంటీ సాహిర్‌పాసఆ, పైలెట్ ఫరీద్ అహ్మద్ తెలిపారు.

గంజాయి మొక్కలు స్వాధీనం


గంజాయి మొక్కలను సాధీనం చేసుకుంటున్న పోలీసులు

కెరమెరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలం అంతాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో నిషేధిత గంజాయి సాగు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఏఎస్పీ చిత్తరంజన్ ఆదేశాల మేరకు ఎస్సై మధుకర్ సిబ్బందితో శనివారం తనిఖీ చేశారు. గ్రామానికి చెందిన అత్రే విశ్వనాథ్ చేనులో ఊదు గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ జిల్లాలో పోలీసులు గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నారని చెప్పారు. గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటాదమని హెచ్చరించారు. గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తిస్తే సమాచారం అందించాలన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

చింతలమానేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి మండలం రన్‌వెల్లి గ్రామానికి చెందిన దుర్గం చిరంజీవి గంజాయి విక్రయిస్తున్న కేసులో శనివారం అరెస్టు చేసినట్లు సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై నరేష్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రన్‌వెల్లికి చెందిన చిరంజీవి సులువుగా డబ్బు సంపాధించాలని మహారాష్ట్ర నుంచి గంజాయిని తక్కువ ధరకు తీసుకు వచ్చి కూలీలకు, విద్యార్థులకు, యువకులకు ఎక్కువ ధరకు అమ్ముతున్నాడని తెలిపారు. అతడి వద్ద 200 గ్రాముల గంజాయిని స్వాధీన పర్చుకుని కోర్టులో ప్రవేశ పెట్టగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు.

వ్యాపారాలు డీలా..



- గిరాకీలు లేక వ్యాపారుల ఆందోళన
- ఇంటి, దుకాణాల అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు

ఆసిఫాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొంత కాలంగా వ్యాపారాలు డీలా పడ్డాయి. దీంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఏ వ్యాపారం చేసినా కొద్దో గొప్పో లాభాలను తెచ్చి పెడుతుంది. కానీ ఇటీవల ఏ ఒక్క వ్యాపారిని కదిలించినా వ్యాపారమే లేదు అనే మాట అందరి నోట నుంచి వినిపిస్తోంది. జిల్లాలో ఆన్‌లైన్ షాపింగ్ పై ప్రజలు ఎక్కువగా మక్కువ చూపుతుండడంతో స్థానికంగా వ్యాపారాలు కుదేలవుతున్నాయి. ఈ ఏడాది దసరా,దీపావళి పండుగలకు ఆశించిన స్థాయిలో వ్యాపారాలు సాగలేదని చెబుతున్నారు. గతంలో పండుగలు వస్తున్నాయంటే వారం రోజుల ముందు నుంచే గిరాకీలతో సందడి సందడిగా ఉండి వ్యాపారాలు బాగా సాగేవని, ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవని వ్యాపారులు వాపోతున్నారు. ఇటీవల దసరా, దీపావళి పండుగల సందర్భంలోనూ కొనుగోళ్లు నామమాత్రంగానే సాగాయని చెబుతున్నారు.


కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న దుకాణం

జోరుగా ఆన్‌లైన్ వ్యాపారం..

జిల్లాలో ఆన్‌లైన్ వ్యాపారం రోజురోజుకు రెట్టింపవుతోంది. దీంతో జిల్లాలోని రిటైలర్స్, హోల్ సెల్ మార్కెట్‌లపై తీవ్ర ప్రభావం ఏర్పడి వ్యాపా రాలు పూర్తిగా దెబ్బతీస్తున్నాయని చెబుతున్నారు. ఒక్క క్లిక్‌తోనే అవసరమైన వస్తువులన్నీ ఇంటికే వస్తుండడంతో ఆన్‌లైన్ ఆర్డర్‌ల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో వస్త్రాలు, డ్రెస్‌లు, కాస్మోటిక్, ఎలక్ట్రానిక్స్ తదితర వస్తువుల కొనుగోళ్లన్నింటిని ఆన్‌లైన్‌లోనే సాగుతున్నాయి. దీంట్లో రిటన్ ఫెసిలిటి కూడా ఉండడంతో యువత మరింత మొగ్గు చూపుతున్నారు.

ఆన్‌లైన్ బిజినెస్‌తో జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలలోని షోరూంలు, దుకాణాలు పెట్టుకున్న వ్యాపారులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. జిల్లాలో వ్యాపారాలు డీలా పడడానికి మహాలక్ష్మి పథకం ఒక కారణంగా చెప్పుకోవచ్చు. డిసెంబరు 9, 2023 నుంచి మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చింది. దీంతో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది. దీంతో బస్సులలో ఉచితంగా ప్రయాణించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. జిల్లాలో ఇప్పటివరకు ఒక కోటి యాభై లక్షలకు పైగా మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నారని ఆర్టీసీ అధికారుల గణంకాలను బట్టి తెలుస్తోంది. మహిళలకు ఉచిత ప్రయాణంతో కొనుగోళ్లపై ప్రభావం పడింది. తమకు అవసరమైన వస్తువులను, వస్త్రాలను, నగలను దూర ప్రాంతాల్లో ఉన్న మంచిర్యాల, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ లాంటి నగరాలలో కొనుగోలు చేస్తుండడంతో స్థానికంగా కొనసాగుతున్న వ్యాపార వాణిజ్య సముదాయాలపై తీవ్ర ప్రభావం పడింది.

కొనుగోళ్లు లేక..

వినియోగదారుల కొనుగోళ్లు లేకపోవడంతో దుకాణాల అద్దె, వర్కర్‌ల జీతాలు చెల్లించలేక వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా కేంద్రంలోని కొన్ని వ్యాపార వాణిజ్య సముదాయాలు గిరాకీలు లేక వెలవెలబోతున్నాయి. కొన్ని దుకాణాల్లో ఉదయం నుంచి సాయంత్రం బోణీ కూడా కావడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో గిరాకీలు లేక ఉత్తారాది రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు దుకాణాలను మూసుకుని వెళ్లి పోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. అలాగే గిరాకీలు లేక పోవడంతో రెండు దుకాణాలు ఉన్న వారు ఒక దుకాణానికే పరిమితం అవుతున్నారు. వేలకు వేల అద్దెలు, వర్కర్ల వేతనాలు చెల్లించేందుకు సైతం ఇబ్బందులు తలెత్తడంతో వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. కొంత మంది వ్యాపారులు అద్దెకు తీసుకున్న గదులను ఖాళీ చేయడంతో జిల్లా కేంద్రంలో చాలా చోట్ల దుకాణాల ముందు టు-లెట్ బోర్డులు కనిపిస్తున్నాయి.

గిరాకీలు లేవు..

సూర్యప్రకాష్ సొలంకీ, ఆసిఫాబాద్



మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో గిరాకీలు లేవు. కొంత కాలంగా గిరాకీ లు లేక వ్యాపారాలు డీలా పడ్డాయి. మహాలక్ష్మి పథకంతో మహిళలు ఇతర ప్రాంతాలకు వెళ్లి వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. దీంతో స్థానిక వ్యాపారాలపై ప్రభావం పడింది. దుకాణాల అద్దె చెల్లించడం కష్టతరంగా మారింది.

ధాన్యం కాజేసిన కేసులో వ్యక్తి అరెస్టు

జైపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్-మద్దులపల్లి డీసీఎంఎస్ కేంద్రంలో తప్పుడు లెక్కలతో వరిధాన్యాన్ని చూపించి సివిల్ సప్లయి ఫండ్స్ డబ్బులు కాజేసిన కేసులో మూడవ నిందితుడు అయిన తాటిపల్లి సాయికుమార్‌ను శనివారం అరెస్టు చేసినట్లు శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సివిల్ సప్లయి ఫండ్స్ నుంచి రూ. 1.30 కోట్లు కాజేశాడని సాయికుమార్ తండ్రి తాటిపలి శ్రీనివాస్‌తో పాటు మరో 11 మంది పరారీలో ఉన్నారని తెలిపారు. వారిని పట్టుకోవడం కోసం జైపూర్ ఎస్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు.

క్షుద్ర పూజల కలకలం


క్షుద్ర పూజలు చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

మందమర్రిటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలచెట్టు ఏరియా డబుల్‌బెడ్‌రూం గృహాల వద్ద క్షుద్ర పూజలు కలకలం రేపాయి. శనివారం డబుల్‌బెడ్ రూంలోని ఓ ఇంటి గుమ్మం ముందు బొమ్మను తయారు చేసి వివిధ రకాల ముగ్గులు వేయడంతో కాలనీ వాసులు భయాందోళనకు గురవుతు న్నారు. ఆ కాలనీలో వారు తెల్లవారు జామున బయటికి వచ్చి చూడగా బొమ్మ పెట్టి ముగ్గులు వేసి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. నివాసాలు లేని పేదలకు ప్రభుత్వం కేటాయించిన నివాసాల్లో ఓ ఇంటి గుమ్మం ముందు క్షుద్ర పూజలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

గోదావరిలో పడి యువకుడి మృతి


శ్రీకాంత్ (ఫైల్)

చెన్నూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కెపల్లి గ్రామానికి చెందిన ఏలాది శ్రీకాంత్ (21) అనే యువకుడు ప్రమాదవశాత్తూ గోదావరి నదిలో పడి మృతిచెం దాడు. మేస్త్రీ పని చేసే శ్రీకాంత్ శనివారం సమీపంలోని గోదావరి నదికి చేపలు పట్టేందుకు వెళ్లాడు. బండ రాళ్లపై కూర్చుని చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తూ జారి గోదావరి నదిలో పడడంతో నీటిలో ము నిగి మృతిచెందాడు. శ్రీకాంత్‌కు తండ్రి మధునయ్య ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి


కొనుగోలు కేంద్రాల స్థలం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

దహెగాం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. మండలంలోని కల్వాడ, కొండచవెల్లి, చంద్రపల్లి, గెర్రె, ఒడ్డుగూడ, లగ్గాం, దహెగాం గ్రామాల్లో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం వరి ధాన్యం కొనుగోళ్లకు 40 కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలను ఎత్తు ప్రదేశాల్లో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. రైతులకు తాగునీరు, నీ డ ఇతర మౌలిక వసతులు కల్పించాలని ఆయన సూచించారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకురావాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం అదనపు కలెక్టర్ పరిశీలించారు. మండలంలోని దహెగాం కల్వాడ, కుంచెవెల్లి, చంద్రపల్లి, గెర్రె, ఒడ్డుగూడ గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాల స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంచెవెల్లి, కల్వాడ గ్రామాల్లో ధాన్యం ఆరబోయడానికి అనువైన స్థలాలు లేక పోవడంతో అటవీ శాఖ పరిధిలోని స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఏఆర్ శ్యాముల్, ఎంఆర్ఐ నాగభూషణం, సీఈవో బక్కయ్య, జీవన్‌చారి, సాయి ఉన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల స్థలాల దగ్గర రైతులకు సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. మండలంలోని ఎల్లూరు, గుండ్లపేట, కొండపల్లి వరి కొనుగోలు కేంద్రాల కోసం శనివా రం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పది నుంచి 15 రోజుల్లో రైతులకు పంట చేతికి వస్తుందని వాటికి అనుగుణంగా కొనుగోలు కేంద్రం సిద్దంగా ఉంచాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మండలంలోని రైస్ మిల్లును తనిఖీ చేశారు. ఆయన వెంట ఆర్ఐ రాజేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి

ఆసిఫాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో శనివారం మండల విద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి, విద్యుత్ సౌకర్యం, విద్యార్థులకు, విద్యార్థినులకు వేర్వేరుగా మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రాథమిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. యు-డైస్ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదతరులు పాల్గొన్నారు.

కైరిగూడలో 101 శాతం బొగ్గు ఉత్పత్తి


మాట్లాడుతున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి

రెబ్బెన, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా కైరిగూడ ఓపెన్ కాస్టు నుంచి అక్టోబరు నెలలో 101 శాతం బొగ్గు ఉత్పత్తి సాధిచామని ఏరియా జనరల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి అన్నారు. గోలేటి టౌన్ షిప్‌లోని జీఎం కార్యాలయంలో శనివారం సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబరు నెలలో కైరిగూడ ఓపెన్ కాస్టు నుంచి 3 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం మూడు 3.03 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధిచామని తెలిపారు. ఉద్యోగులు, సమావేశంలో ఎస్ఓటు జీఎం రాజమల్ల, పర్సనల్ హెచ్ఓడీ శ్రీనివాస్, ఐఈడీ ఉజ్వల్ బెహారా పాల్గొన్నారు.

ఉద్యోగులు క్వార్టర్లలోనే నివాసం ఉండాలి

రెబ్బెన, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులకు కేటాయించిన క్వార్టర్లలో నే ఉద్యోగుల కుటుంబాలు నివాసం ఉండాలని అద్దెకు ఇవ్వకూడదని పర్సనల్ డిపార్టుమెంట్ హెచ్ఓడీ శ్రీనివాస్ అన్నారు. శనివారం జీఎం కార్యాలయంలో ఉద్యోగులకు నివాస క్వార్టర్లపై కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇటీవల బెల్లంపల్లి ఏరియాకు బదిలీపై వచ్చిన, నూతనంగా విధుల్లో చేరిన ఉద్యోగులకు కౌన్సిలింగ్‌లో ఎంపిక చేసుకున్న నివాస క్వార్టర్లను కేటాయించారు. క్వార్టర్‌ను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ డిపార్టుమెంట్ ఇన్‌చార్జి రాజేంద్రప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ అర్చన పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

వాంకిడి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఖమాన గ్రామానికి చెందిన కిష్టయ్యకు శనివారం తాను పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఎస్సై మహేందర్ అందజేశారు. కిష్టయ్య సెల్‌ఫోన్ మార్కెట్ ఏరియాలో పోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ గుర్తించి బాధితుడికి అందజేసినట్లు తెలిపారు. సెల్‌ఫోన్‌ను గుర్తించిన కానిస్టేబుల్ నహీంను ఎస్సై అభినందించారు.

పోలీసు విధులకు ఆటంకం కేసు నమోదు

భీమారం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు నమోదు చేసినట్లు భీమారం ఇన్‌చార్జి ఎస్ఐ లక్ష్మీప్రసన్న శనివారం తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం అక్టోబర్ 30న మండల కేంద్రంలో జరిగిన పెళ్లి భరత్ వేడుకల్లో చెన్నూరు-మంచిర్యాల హైవే రోడ్డుపై డీజే సౌండ్ పెట్టిన్యూసెన్స్ చేయగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ సమ్మయ్య సంఘటన స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించే క్రమంలో అతడిపై కొందరు వ్యక్తులు దురుసుగా ప్రవర్తించారు. కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోలీసు విదులకు ఆటంకం కలిగించిన భీమారం గ్రామానికి చెందిన ఎక్స్‌కవేటర్ యాజమాని మెండే పున్నం, బోయిన మహేష్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శ్రీరాంపూర్ ఏరియాలో 61 శాతం బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న జీఎం మునిగంటి శ్రీనివాస్

శ్రీరాంపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలో 61 శాతం బొగ్గు ఉత్పత్తి సాదించినట్లు ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అక్టోబరు నెలకు సంబంధించిన బొగ్గు ఉత్పత్తిపై ఆయన మాట్లాడారు. శ్రీరాంపూర్ ఓసీపీలో ఓబీ వెలికితీసే కాంట్రాక్టు కంపెనీలు వెళ్లిపోవడం వల్ల ఉత్పత్తి కుంటుపడిందన్నారు. కంపెనీ ఆధ్వర్యంలో ఓవర్ బర్డెన్, బొగ్గు వెలికితీస్తున్నట్లు చెప్పారు. అలాగే వర్ష ప్రభావంతో ఉత్పత్తిలో వెనుకబడినట్లు పేర్కొన్నారు. ఆయా కారణాలతో ప్రతి నెల వంద శాతం దాటే ఉత్పత్తి కేవలం 34 శాతానికి పరిమితమైందన్నారు. అయితే అండర్ గ్రౌండ్ గనుల్లో అధిక శాతం బొగ్గు వెలికితీసినట్లు తెలిపారు. ఆర్కే 5లో 93 శాతం, ఆర్కే 7లో వంద శాతం, ఆర్కే న్యూటెక్‌లో 117 శాతం, ఎస్ఆర్‌పీ 1లో 100 శాతం, ఎస్ఆర్‌పీ 3,3ఏలో 71 శాతం, ఇందారం 1ఏలో 84 శాతం ఉత్పత్తి సాధ్యమైందన్నారు. ఇందారం ఓసీపీలో 91 శాతం వచ్చినట్లు వివరించారు. మొత్తంగా ఏరియా బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 5 లక్షల 43 వేల 300ల టన్నులకుగాను, 3 లక్షల 31 వేల 579 టన్నులు వచ్చిందన్నారు. గతంలో ప్రతి ఏడాది కనీసం 100 మస్టర్లు చేస్తే సరిపోయేదని, నూతన సర్క్యులర్ ప్రకారం 150 మస్టర్లు చేయాల్సి ఉందన్నారు. కార్మికులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. ఏరియాలోని 9043 మందికి సీపీఆర్ఎంఎస్ కార్డులున్నాయని, వాటిని రెన్యూవల్ చేసుకోవాలని జీఎం సూచించారు. పెన్షనర్లు తమ జీవన్ ప్రమాణ్ పత్రాన్ని అధికారులకు సమర్పించాలని, వీలుకాని వారు సీఎంపీఎఫ్ కార్యాలయం అధికారులు శ్రీరాంపూర్ ఏరియాలో 12, 13 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక శిబిరానికి తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) అనిల్ కుమార్, డీజీఎం(ఐఈడీ) రాజన్న, సీనియర్ పీవో కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడదను పోగొట్టాలి

తాండూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదారం గ్రామంలో కోతుల బీభత్సం సృష్టిస్తున్నాయని, వెంటనే అధికారులు కోతులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని నాయకుడు రామగౌని మహీధర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో కోతులు గుంపులుగా తిరుగుతూ ఇళ్లలోకి చొరబడి భయ పెడుతున్నాయన్నారు. శనివారం గ్రామానికి చెందిన సింగరేణి కార్మికునిపై కోతులు దాడి చేయడంతో గాయపడ్డాడని తెలిపారు. పంచాయతీ, అటవీ శాఖ అధికారులు కోతుల బెడదను నివారించాలని కోరారు.

పిచ్చి మొక్కల తొలగింపు

తాండూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా శనివారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో రోడ్డుకిరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను, ముళ్ల పొదలను మండల పంచాయతీ అధి కారి అనిల్‌కుమార్ సిబ్బందితో తొలగించారు. పిచ్చి మొక్కలు రోడ్లపైకి రావడంతో ఎదురుగా వాహనాలు కనిపించకపోవడంతో బ్లేడ్ ట్రాక్టర్‌తో పిచ్చి మొక్కలను తొలగించి చదును చేయించారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

కన్నెపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శనివారం కన్నెపల్లిలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్తీక దీపాలను వెలిగించారు. అర్చకులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

భజన మండలి కమిటీ ఎన్నిక

కన్నెపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీరాపూర్ గ్రామ అభయాంజనేయ భజన మండలి కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సిద్దం బాపు, ఉపాధ్యక్షులుగా కాసారం శ్రీనివాస్‌గౌడ్, సెక్రటరీగా దుర్గం శంకర్, జాయింట్ సెక్రటరీగా సొండ్ల రవి, గౌరవాధ్యక్షులుగా పానుగంటి రాజయ్య, గౌరవాధ్యక్షులుగా దాగామ గుండయ్య, సత్తయ్య, అంకులు, మధుకర్‌గౌడ్, సలహాదారులుగా వెంకటచారి, రమేష్‌చారీలను ఎన్నుకున్నారు. ఎన్నికైన వారిని సభ్యులు ఘనంగా సన్మానించారు.

వీధిన పడేసిన రోడ్ల విస్తరణ



సింగరేణి కళావేదిక ఎదురుగా తొలగించిన వ్యాపారుల దుకాణాలను

- వీధి వ్యాపారుల దుకాణాలు తొలగింపు
- ఉపాధి కోల్పోయిన వందల మంది వ్యాపారులు
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న బాధిత కుటుంబాలు

బెల్లంపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి పట్టణంలో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులతో చిరు వ్యాపారులు ఉపాధి కోల్పోయారు. వందల కుటుంబాల జీవనోపాధి పోయి రోడ్డున పడ్డాయి. 40 ఏళ్లకు పైగా పట్టణంలో రహదారుల పక్కన చిన్న చితక వ్యాపారాలు, చేతి వృత్తుల పనులు చేసుకుంటూ జీవనం సాగి స్తున్నవారికి ఒక్కసారిగా



అంబేద్కర్ చౌరస్తా వద్ద తొలగించిన వీధి వ్యాపారుల దుకాణాలను

బతుకు భారమైంది. ఉపాధి కోల్పోయిన ఆయా చిరు వ్యాపారుల కుటుంబాలకు ప్ర త్యామ్నాయం లేకుండా చేశారని వేదనకు గురవుతు న్నారు. నిన్నటి వరకు రోడ్డు పక్కన చిరు వ్యాపారంతో జీవనం సాగించే వారు ప్రస్తుతం కుటుంబ పోషణ ఎలా అని కుమిలి పోతున్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం చిరు వ్యాపారాలు సాగించడానికి స్థలాలు ఏర్పాటు చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

రోడ్డు విస్తరణ పనులతో వీధిన పడ్డారు..

పట్టణంలో రహదారుల పక్కన దశాబ్ధాల కాలంగా దాదాపు వందల కుటుంబాలు డబ్బాలు, దుకాణాలు ఏర్పాటు చేసుకొని వీధి వ్యాపారాలు చేసుకుంటూ జీవనం వెల్లదీస్తున్నారు. ఇటీవల పట్టణంలో రోడ్ల విస్తరణ కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పట్టణంలోని ప్రధాన రహదారులు వెడల్పు చేస్తూ వాటి ర్మాణాల కోసం రూ. 8.94కోట్లు నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం మున్సిపల్ అధికారులు ఇందుకు సంబంధించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు.

పట్టణంలోని సింగరేణి ఏరియా ఆసుపత్రి నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు గతంలో దాదాపు 20 నుంచి వెడల్పుతో 25ఫీట్ల రోడ్డు ఉంది. ప్రస్తుతం ఈ రోడ్డును వంద ఫీట్ల రోడ్డు నిర్మాణం కోసం అధికారులు రహదారుల పక్కన ఉన్న దుకాణాల సముదాయాలను తొలగిస్తున్నారు.

అలాగే పాత బస్టాండ్ నుంచి అంబేద్కర్ నగర్ చౌరస్తా వరకు 60 ఫీట్ల రోడ్డును చేపట్టనున్నారు. ఇందుకు సంబం ధించిన పనులను అధికారులు చేపడుతుండడంతో రహదారుల పక్కన ఉన్న చిరు వ్యాపారుల కొట్లు, దుకాణాలను తొలగించారు. ప్రత్యామ్నాయం చూపడకుండా డబ్బాలు తొలగించడంతో చిరు వ్యాపారులు రోడ్డున పడ్డారు. తమకు ప్రత్యామ్నాయం చూపించి ఆదు కోవాలని వేడుకుంటున్నారు. రోడ్డు విస్తరణతో ఉపాధి కోల్పోయి చిరు వ్యాపారాలు చేయలేని స్థితిలో ఉన్నామని, రోడ్డు విస్తరణతో బతుకుదెరువు సమస్యగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని దుకాణ సముదాయాలు నిర్మించి ఆదుకోవాలని కోరుతున్నారు.



అంబేద్కర్ చౌరస్తా వద్ద కూల్చివేసిన దుకాణాలు

రహదారి విస్తరణతో రోడ్డున పడ్డాం...

కోరి, టిఫిన్ షాపు నిర్వాహకుడు

40 ఏళ్లగా మా తండ్రి, నేను టిఫిన్‌షాపు నిర్వహించుకుంటూ ఉపాధి పొందుతున్నాం. ప్రస్తుతం రహదారి విస్తరణతో రోడ్డున పడ్డాం. అధికారులు ప్రత్యామ్నాయం చూపకుండా రోడ్డు విస్తరణ పేరుతో తొలగించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం ఆదుకోకపోతే మాలాంటి వ్యాపారాలకు బతుకుదెరువు కష్టం.

ప్రత్యామ్నాయం చూపాలి...

రాజేశ్, వీధి వ్యాపారస్తుడు

రహదారి విస్తరణ పనులు చేపడుతుండడంతో నా షాపు తొలగించారు. దీంతో ఉపాధి కోలోయాను. రోడ్డు విస్తరణలో ఉపాధి కోల్పోయినవారందరికి ప్రత్యామ్నాయం చూపి ఆదుకోవాలి. చిరు వ్యాపారులందరికి ప్రభుత్వం దుకాణాలు నిర్మించి బతుకుదెరువు చూపించాలి. లేకుండా మా కుటుంబం బతకడం కష్టం.

అండర్-19 జోనల్ స్థాయి 5కే రన్ ఎంపిక పోటీలు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

బెల్లంపల్లి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్-19 ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి 5కే రన్ ఎంపిక పోటీలు నిర్వహించినట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యాదర్శి బాపురావు తెలిపారు. ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ సంతోస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలతో ఆరోగ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. రన్నింగ్ పోటీల్లో రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీడీ హరీశ్, పీఈటీ రాజేందర్, రాజశేఖర్, వామన్, ప్రతాప్, అద్యాపకులు పాల్గొన్నారు.

పాఠశాలలో వసతుల పరిశీలన



పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయని పత్రం అందజేస్తున్న సభ్యులు

జైపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ ఏవం హరితహ విద్యాలయ్ పురస్కారానికి మండలంలోని ఇందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని వసతులను శనివారం ఎస్‌హెచ్‌వీఆర్ బృందం సభ్యులు పరిశీలించారు. పాఠశాలలోని పరిశుభ్రత, పచ్చదనం, విద్యార్థులకు అందిస్తున్న రక్షిత మంచినీటి సౌకర్యం గురించి వివరాలను నమోదు చేసుకున్నారు. విద్యార్థుల క్రమ శిక్షణను, తరగతి గదులను పరిశీలించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ స్వచ్ఛ పాఠశాలగా ఎంపికైతే లక్ష రూపాయల నగదు బహుమతిగా వస్తుందని బృందం సభ్యుడు, చెన్నూరు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హమ్మద్ అబ్దుల్ అమీద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, బృందం సభ్యులు సాయికృష్ణ పాల్గొన్నారు.

బైకులో పెట్టిన నగదు చోరీ

మంచిర్యాల క్రైం,నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం ఏసీసీ శ్రీనివాస కాలనీకి చెందిన పెద్దూరి శ్రీనివాస్ అనే వ్యక్తి ద్రిచక్ర వాహనంలో ఉంచిన నగదు రూ. 2లక్షల 75వేలు చోరీకి గురైనట్లు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎస్‌బీఐ బ్యాంకులో నగదు తీసుకుని ద్విచక్ర వాహనంలోని ట్యాంక్ కవర్‌లో నగదు ఉంచి డీమార్ట్ వద్ద సామగ్రి తీసుకున్నాడు. అనంతరం పక్కనే ఉన్న మార్కెట్ వద్ద కూరగాయలు తీసుకుని బండి వద్దకు వచ్చి చూడగా నగదు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు తనను వెంబడించి నగదు చోరీ చేసినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యార్థులకు గోల్డెన్ సార్ట్ అవార్డులు



విద్యార్థులకు గోల్డెన్ సార్ట్ అవార్డులు అందజేస్తున్న ఎంఈవో

దండేపల్లి నవంబరు 1(ఆంధ్రజ్యోతి): చదువే ఉన్నతమైన స్థానంలో నిలుపుతుందని, చదువును మించిన ఆస్తి మరోకటి లేదని ఎంఈవో మంత్రి రాజు అన్నారు. బిగ్ హెల్త్ ఫర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో మండలం లోని రెబ్బనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలో విద్యార్థులు ఎఫ్ఏ2 పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రతి తరగతిలోని 10 మంది విద్యార్థులకు గోల్డెన్ సార్ట్ అవార్డులను ఎంఈవో ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానంలో నిలిచే విధంగా ప్రతి ఒక విద్యార్థి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బిగ్ హెల్త్ ఫర్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎండి శఫిరోద్దీన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ తొలగింపు

చెన్నూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులోని జగన్నాథస్వామి దేవాలయం సమీపంలో జాతీయ రహదారికి దగ్గరగా ఉన్న సర్వే నెంబరు 869/2లో ఉన్న మూడు ఎకరాల భూమి చుట్టూ శుక్రవారం రాత్రి కొందరు వ్యక్తులు ఫెన్సింగ్ వేసి మామిడి మొక్కలు నాటారు. విషయం తెలుసుకున్న దేవాలయం ఈవో రవి, ఆదిలాబాద్ ఇన్‌స్పెక్టర్ రవికిషన్, వేలాల మల్లికార్జున స్వామి దేవాలయం ఈవో రమేష్, సిబ్బంది, శనివారం భూమి వద్దకు చేరుకుని ఫెన్సింగ్‌ను, మామిడి మొక్కలను జేసీబీ, ట్రాక్టర్‌లతో తొలగించారు. భూమిని ఎవరైనా అక్రమణకు పాల్పడితే వారిపై చర్యలుంటాయని తెలిపారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



పోటీలను ప్రారంభిస్తున్న మాజీ కౌన్సిలర్ కిషన్

మంచిర్యాల క్రైం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : క్రీడలతోనే యువతకు ఉజ్వల భవిష్యత్ అని మాజీ కౌన్సిలర్ బొలిశెట్టి కిషన్ అన్నారు. శనివారం పాత మంచిర్యాల మున్సిపల్ క్రీడా ప్రాంగణంలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో పోటీలు నిర్వహించుకోవాలన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకే ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు స్టేడియం నిర్మాణం చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొండల్‌రావు, నాయకులు ఎడ్ల మల్లేష్ పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణంలో పిచ్చిమొక్కల తొలగింపు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన అధికారులు

దండేపల్లి నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం అలంకార ప్రాయంగా, నిరుయోగంగా ఉండి పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయంటూ శనివారం వార్త ప్రచురితమైంది. కథనానికి దండేపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి జేఆర్ ప్రసాద్, ఎంపీవో కేవి ప్రసాద్ స్పందించారు. పంచాయతీ కార్యదర్శుల సహకారంతో పంచాయతీ కార్మికులు. ట్రాక్టర్ల బేడ్‌తో క్రీడా ప్రాంగణ మైదానంలో పిచ్చి మొక్కులను తొలగించి పరిసర ప్రాంతమంత శుభ్రం చేయించారు.



క్రీడా ప్రాంగణంలో ట్రాక్టర్ బేడ్‌తో శుభ్రం చేయిస్తున్న దృశ్యం

మామిడిగట్టులో కుక్కల స్వైర విహారం

మందమర్రిరూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మామిడిగట్టు గ్రామంలో కుక్కలు రోడ్లపై స్వైర విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. బయటకు వచ్చిన విద్యార్థులు, వృద్ధులు, మహిళలపై కుక్కలు దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. గుంపులుగా కుక్కలు తిరగడంతో ప్రజలు భయపడుతున్నారు.

ఇటీవల యువకుడిపై కుక్కలు కరవడంతో తీ వ్ర గాయాలపాలయ్యాడు. కుక్కల భయానికి విద్యార్థులు కూడా బడులకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలపై ఎక్కువగా కుక్కలు దాడి చేయడంతో స్థానికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కంకర తేలి..అధ్వానంగా మారి..

దెబ్బతిన్న రహదారులతో ఇక్కట్లు

మందమర్రిరూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సారంగపల్లి గ్రామంలో ఉన్న రోడ్డు కంకర తేలి అధ్వానంగా తయారైంది. ప్రతీ రోజు గ్రామస్తులు, విద్యార్థులు, రైతులు ఈ రోడ్డుపై నుంచి మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కంకర తేలడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నాయి. కిందపడి గాయాలపాలైన సంఘటనలు కూడా లేకపోలేదు. అయితే పాలకవర్గం లేకపోవడం వల్ల పట్టించుకునే వారే కరువయ్యారని ప్రజలు పేర్కొంటున్నారు. ముందు మరిన్ని ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోకముందే ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి లీకేజీని అరికట్టండి

భీమారం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భీమారంలోని ఆవడం క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారి 63ను ఆనుకుని ఉన్న వాటర్ పైపులైన్ వద్ద లీకేజీ జరుగుతుందని, దీన్ని అరికట్టాలని కోరుతూ బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్ శనివారం ఎంపీడీవోకు వినతి పత్రం అందించారు. నీరు లీకేజీ అవుతుండడంతో నీరు రోడ్డుపైకి వస్తుందని, దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే తాగునీరు కలుషితం అవుతుందన్నారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

కన్నెపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కన్నెపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ పదవీ విరమణ పొందగా శనివారం పాఠశాలలో ఎంఈవోలు మహేశ్వర్‌రెడ్డి, రాము, ఉపాధ్యాయులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సిమెంటు పరిశ్రమలకు ప్రోత్సాహమేదీ..?

(5వ పేజీ తరువాయి)

వెలికి తీయడం మూలంగా ప్రాజెక్ట్‌కు నష్టం వాటిల్లే అవకాశం ఉండటంతోపాటు పర్యావరణ సమస్యల కారణంగా పై రెండు కంపెనీల నిర్వహణకు అటంకం కలిగింది.

అటవీ ప్రాంతంలో సున్నపురాయి తవ్వకాలకు సంబంధించి అనుమతులకు ప్రభుత్వ పరంగా ఆటంకాలు ఎదురు కావడంతో రెండు కంపెనీల మూసివేత అనివార్యం అయింది. దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ గతంలో బిర్లా యాజమాన్యం కింద పని చేస్తుండేది. ఇటీవల అది కూడా యాజమాన్యం మార్పిడి జరిగి ఆదాని గ్రూప్‌లోకి వెళ్లింది.

మూసివేతకు గురైన ఎంసీసీ...

అత్యంత ఘణమైన చరిత్ర గల మంచిర్యాల సిమెం టు కంపెనీ (గతంలో ఏసీసీ)ని యాజమాన్యం నష్టాల పేరుతో నిరవధికంగా మూసివేసింది. సున్నపురాయి లీజు గడువు ఇంకా మిగిలి ఉండగానే కంపెనీ మూసివేతకు రంగం సిద్ధం చేసిన యాజమాన్యం, క్రమంగా కార్మికుల సంఖ్యను తగ్గిస్తూ వచ్చింది. ఉత్పత్తి వ్యయం పెరగడంతో పాటు ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం లేక కర్మాగారాన్ని మూసివేసేందుకే మొగ్గు చూపుతున్నట్లు యాజమాన్యం తెలిపినప్పటికీ ఆ నిర్ణయం వెనుక స్వలాభమే ఉన్నట్లు అప్పట్లో కార్మికులు ఆరోపించారు. గతంలో ఏసీసీ(ది అసోసియేటెడ్ సిమెంట్ కంపెనీస్) లిమిటెడ్ పేరుతో దశాబ్దాల కాలంపాటు ఉత్పత్తి సాధించిన కంపెనీని తదనంతరం స్థానికంగా కొందరు కొనుగోలు చేసి కొంతకాలం పాటు నడిపించారు. అప్పట్లో కంపెనీని ఏసీసీ యాజమాన్యం విక్రయించగా వందలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ప్రభుత్వ పరంగా అనుమతులు లభించకపోవడం ఒక కారణమైతే, ప్లాంటులో జరిగిన కొన్ని చర్యల కారణంగా అభద్రాతా భావనకు గురైన ఏసీసీ యాజమాన్యం కంపెనీని సమూ లంగా విక్రయించా లనే నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం జరిగింది. ఈ కంపెనీలో గ్రేడ్-1 పోర్ట్ ల్యాండ్ సిమెంటు ఉత్పత్తి అవుతుండగా దేశంలోనే అత్యంత దృఢమైన సిమెంటును ఉత్పత్తి చేయడంలో కంపెనీ అగ్రస్థానంలో నిలిచింది.

నూతన కంపెనీల ఏర్పాటు ఏది..?

జిల్లాలో సున్నపు రాయి నిల్వలు పుష్కలంగా ఉన్న ప్పటికీ నూతన కంపెనీల ఏర్పాటు కు వ్యాపారులు ముందుకు రావడంలేదు. నూతన సిమెంటు కంపెనీల ఏర్పాటుకు ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం లభించదని భావిస్తున్నందు వల్లే వ్యాపారులు ముందుకు రావడంలేదని తెలుస్తోంది. నూతన కంపెనీలను ఏర్పాటు చేస్తే సున్నపు రాయి సేకరణకు అటవీ శాఖ అనుమతులు లభించడం కష్టతరంగా ఉంటుందని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. దీంతో పాటు కాలుష్యం పేరిట ప్రజల నుంచి వ్యతిరేకత రావడం కూడా ఆటంకంగా మారింది. దశాబ్దాల పాటు సరిపడేలా సున్నపు రాయి నిల్వలు ఉన్నా కార్మాగారాల స్థాపనకు మొగ్గు చూపకపోవడం గమనార్హం. ప్రభుత్వపరంగా ప్రోత్సాహం లభిస్తే కొన్ని కంపెనీలు ఏర్పాటయ్యే అవకాశం ఉండగా, నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కూడా లభించనున్నాయి.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఆంజనేయులు

కాసిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కాసిపేట ఎస్ఐ ఆంజనేయులు అన్నారు. శనివారం సోమగూడెం నుంచి శిశుమందిర్ మైదానం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. వాహనదారులు, ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహనాలను వేగంగా, మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపవద్దన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కార్లు నడిపే వారు సీటు బెల్టు ధరించాలన్నారు.

లక్షెట్టిపేట: ప్రతీ ఒక్క వాహనదారుడు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్సై గోపతి సురేష్ అన్నారు. లక్షెట్టిపేట పట్టణంలోని కరీంనగర్ చౌరస్తాలో శనివారం వాహన దారులకు ట్రాపిక్ నిభందనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు వాహన పత్రాలను తప్పకుండా వెంట ఉంచుకో వాలన్నారు. వాహనం ఆర్సీతో పాటు వాహనాలకు ఇన్సూరెన్స్, పోల్యూషన్ తప్పకుండా కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని, కారు నడిపే సమయంలో సీట్ బెల్టు తప్పకుండా పెట్టుకోవాలన్నారు. లక్షెట్టిపేట ఎస్సై-2 రామయ్య, ఎఎస్సై అన్వర్, సుధాకర్‌తో పాటు పోలీసు సిబ్బంది వాహనదారులు పాల్గొన్నారు.

దండేపల్లి : రహదారి భద్రత ప్రతి ఒకరి బాద్యత అని ట్రాఫిక్ నిబంధనలు అందరు పాటించాలని దండేపల్లి ఎస్సై తహసీనోద్దీన్ సూచించారు. దండేపల్లి మండలం మేదరిపేటలో కాకతీయ డిగ్రీ కళాశాలోని శనివారం వాహనదారులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ బైక్ వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. 18ఏళ్ల నిండిన ప్రతి ఒకరు డ్రైవింగ్ లైసెన్స్ పొందాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పసరిగా వాహనాలకు సంబంధించి ప్రతాలను అందుబాటు ఉంచుకోవాలన్నారు.

అనంతరం వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, వాహనదారులు పోలీసు సిబ్బంది ఉన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకే ఉల్లాస్

జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి అజ్మీర పురుషోత్తంనాయక్

దండేపల్లి నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఉల్లాస్ అమ్మకు అక్షరమాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి అజ్మీర పురుషోత్తంనాయక్ అన్నారు. దండేపల్లిలో ఎంపీడీవో కార్యాలయంలో శనివారం అమ్మకు అక్షరమాలను విజయవంతం చేయాలని గ్రామైఖ్య సంఘాలు, ఓబిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ నిరక్షరాస్యులను గుర్తించి వీరిని అక్షరాస్యులుగా చేసేందుకు ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా అమ్మకు అక్షరామాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. వీరందరినీ చదువుకునే వారిని ప్రోత్సహించాలన్నారు. ఇందు కోసం ఇప్పటికే అక్షర కేంద్రాలను గుర్తించామన్నారు. అందరు అక్షరాస్యులుగా మార్చే విదంగా మన మందరం కలిసి కట్టుగా కృషి చేస్తోందమన్నారు. ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామైఖ్య సంఘం సభ్యులు, వోబిలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, ఎంపీవో విజయప్రసాద్, జిల్లా సమైఖ్య అధ్యక్షురాలు అల్లంల అనిత, ఐకేపీ ఏపీఎం లక్ష్మీ, రిసోర్స్ పర్సన్ సుమన్, రజిత, అశో క్‌రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అజ్మీర పురుషోత్తంనాయక్

సేంద్రియ ఎరువు జాడేది?

- జిల్లాలో నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు
- నిర్మాణాలు పూర్తయినా పట్టింపు కరువు
- ఎక్కడా కనిపించని కంపోస్టు తయారీ
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు



బెజ్జూరు మండలం రెబ్బెనలో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్డు



బెజ్జూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచడంతో పాటు వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారీ లక్ష్యంగా సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించారు. పల్లెల అభ్యున్నతి కోసం అప్పటి ప్రభుత్వం గ్రామాల్లో సేంద్రియ ఎరువులు తయారీ కోసం షెడ్ల నిర్మాణం చేపట్టింది. పారిశుధ్య నిర్వహణతో పాటు సేంద్రియ ఎరువును సమకూర్చాలని ఒక్కో పంచాయతీకి సెగ్రిగేషన్ షెడ్డును అందుబాటులోకి తీసురావాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు ఒక్కో షెడ్డుకు రూ.2.40లక్షలు మంజూరు చేసింది. గ్రామాల్లో సేకరించిన చెత్తను ఇక్కడికి చేర్చి గాజు, ఇనుము, ప్లాస్టిక్ వంటి తదితర పొడి చెత్త వ్యర్థాలను వేరు చేసి గదులలో భద్రపరుస్తారు. తడి చెత్తను కుండీలలో వేసి సేంద్రియ ఎరువును తయారు చేస్తారు. వీటి నిర్వహణ బాధ్యతను సర్పంచ్‌లకు అప్పగించారు. వీటి ద్వారా గ్రామాల్లో సేంద్రియ ఎరువులను తయారు చేసి రైతులకు విక్రయించాలి. కాగా ఆయా గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయినా సెగ్రిగేషన్ షెడ్లు అలంకారప్రాయంగా మారా యి. మరి కొన్ని చోట్ల షెడ్లలోని గదుల్లో తడి, పొడి చెత్తను వేసి అలాగే వదిలేశారు. దీంతో సెగ్రిగేషన్ షెడ్ల పరిసర ప్రాంతాల్లో కాలుష్యం పెరుగుతోంది. దీన్ని నివారించడానికి, సేంద్రియ ఎరువు తయారు చేయడానికి నిర్మించిన షెడ్లు ఎక్కడా కూడా విని యోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవడం లేదు.

● అవగాహన లోపంతోనే..

గ్రామాల్లో పారిశుధ్య సిబ్బందికి, కార్యదర్శులకు సేంద్రియ ఎరువు తయారీపై అవగాహన లేకపోవడంతోనే సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయని చెబుతున్నారు. అప్పట్లో వీరికి శిక్షణ ఇచ్చినప్పటికీ వర్మి కంపోస్టు తయారీ పద్ధతి తెలియకపోవడం, పంచాయతీల్లో సరిపడా సిబ్బంది, గ్రామాల్లో డంప్ యార్డులు లేకపోవడంతోనే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. సంబందిత అధికారులు పట్టించుకోని కారణంగా వృథాగా మారాయి. కొన్ని పంచాయతీల్లో మాత్రం షెడ్లను వినియోగించుకుంటూ సేంద్రీయ ఎరువును తయారీ చేసి పంచాయతీకి ఆదాయం సమకూర్చుతున్నా పూర్తిస్థాయిలో తయారీ లేక ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

● నిర్వహణలో నిర్లక్ష్యం..

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణంతో అటు ప్రజలకు, ఇటు ప్రభుత్వానికి ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. వీటి నిర్మాణంలో చూపిన శ్రద్ధ నిర్వహణలో చూపకపోవడంతో ఎరువుల తయారీకి అవకాశం ఉన్నా అంది పుచ్చుకోలేదు. కాగా రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో సేంద్రియ ఎరువుల తయారిపై దృష్టి సారిస్తారేమోనన్న ఆశలు చిగురిస్తున్నాయి. అయితే అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఎరువుల తయారీకి నోచుకోక మూలనపడ్డాయి. ప్రస్తుతం గ్రామపంచాయతీల పాలనా గడువు కూడా ముగియడం, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం నోటిఫికేషన్ విడుదలైనా కోర్టు తీర్పు కారణంగా ఎన్నికలు వాయిదా పడ్డ విషయం తెలిసిందే. అయితే గ్రామ పంచాయతీల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవ డంతో పారిశుధ్య కార్య క్రమాలు కూడా చేపట్టలేక సతమతమవుతున్న నేపథ్యంలో సెగ్రిగేషన్ షెడ్ల నిర్వ హణకు నిధులు ఇచ్చేదెవరు, వాటి నిర్వహణను పట్టించుకునేదెవరన్న ప్రశ్నలు తలెత్తు తున్నాయి. దీంతో ఇప్పుడు వీటి నిర్వహణపై సందిగ్ధం నెలకొంది. స్థానిక సంస్థల గడువు గడిచినప్పటి నుంచి గ్రామపం చాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగు తున్నాయి.

● 335 పంచాయతీల పరిధిలో..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 335 గ్రామ పంచాయతీల పరిధిలో షెడ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. గ్రామాల్లో సేంద్రియ ఎరువుల తయారిపై సరైన అవగాహన లేకపోవడంతో ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. ప్రతి రోజు ఇళ్ల నుంచి సేకరించిన తడి పొడి చెత్తను వేరు చేసి వాటిని అమ్మితే గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూరుతుంది. మిగితా చెత్తను నాడెప్ వర్మి కంపోస్టు ట్యాంకులో వేసి ఎరువు తయారు చేసి విక్రయించడంతో లాభాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ సేం ద్రియ ఎరువుల తయారీకి అప్పట్లో వానపాములను కూడా సరఫరా చేసినా ఫలితం లేకుండా పోయిందని చెబుతున్నారు.

● మూలకు పడిన ట్రాక్టర్లు..

గ్రామపంచాయతీలకు ఆదాయాన్ని సమకూరేందు కు గత ప్రభుత్వం డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్లను ఏర్పాటు చేసింది. ఇందుకోసం ప్రతి పంచాయతీకి ట్రాక్టర్లను సమకూర్చింది. వాటి ద్వారా ఇంటింటి చెత్తను సేకరించి తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువుల తయారీ చేసేందుకు శ్రీకారం చుట్టగా జిల్లాలో చాలాచోట్ల ట్రాక్టర్లు మరమ్మతుల కు గురై మూలకు చేరాయి. దీంతో గ్రామాల్లో చెత్త సేక రణ సక్రమంగా జరగడం లేదు. దీంతో షెడ్లు పూర్తిగా నిరుపయోగంగా మారాయి. జిల్లాలో ట్రాక్టర్ల నిర్వహ ణ కూడా సరిగా లేని కారణంగా చెత్త సేకరణ అంతంత మాత్రంగానే జరుగు తోంది. పంచాయతీలకు పాలకవర్గాలు లేక ప్రత్యేకాధిరులు గ్రామాల వైపు కన్నెత్తి చూడని కారణంగా కార్యదర్శుల పైనే భారం పడుతుం డడంతో వారికి ప్రత్యేకంగా నిధులు లేక వా రు కూడా వాటి నిర్వహణపై శ్రద్ధ చూపడం లేదు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి వెంకటి

దహెగాం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలంలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి వెంకటి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఏ పంటలకు ఏ మందులు స్ప్రే చేయాలో వివరించారు. వరి కోతకు రావడానికి ఇంకా 15 రోజుల సయయం పడుతుందన్నారు. అలాగే రైతులు ఏఈవోల సలహాలు తీసుకుకు మెలకువలు పాటించి దిగుబడులు సాధించాలన్నారు. లగ్గాం గ్రామంలో వరి కొనుగోలు కేంద్రం స్థలాని పరిశీలించారు. ఆయన వెంట ఏవో రామకృష్ణ, సీఈవో బక్కయ్య సాయి ఉన్నారు.

జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఆసిఫాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పలువురు నాయకులు జెండాను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డీవైఎఫ్ఐ విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. విద్యార్థులు ఇబ్బందులకు గురవకుండా తాము చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కార్తీక్, రాజ్‌కుమార్, సతీష్, పురుషోత్తం, నిఖిల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు ముస్లిం యువకుడి భిక్ష

కౌటాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులకు ముస్లిం యువకుడు భిక్ష పెట్టి మత సామరస్యాన్ని చాటుకుడున్నారు. మార్కెట్ ఏరియాలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న సయ్యద్ గౌస్ శనివారం భిక్ష ఏర్పాటు చేయడంతో పలువురు ఆయనను అభినందించారు.

జిల్లాలో 30 పోలీసు యాక్టు అమలు



మాట్లాడుతున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణ పరిస్థితులను మరింత సవ్యంగా కొనసాగించడానికి నవంబరు 1 నుంచి 30 వరకు జిల్లా అంతటా 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాల యంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 30 పోలీసు యాక్టు అమలులో ఉన్నందున ముందస్తు అనుమతులు లేకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నా, బహిరంగ సభలు తదితర ప్రజలు గుమి కూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదన్నారు. నిషేధిత ఆయుదాలు, దురుద్దేశంతో నేరాలకు ఉసి గొలిపే ఎటువంటి ఆయుధాలు కలిగి ఉండకూడదని చెప్పారు. ప్రజా జనజీవనానికి ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారి తీసే ఇబ్బందకర ప్రజా సమావేశాలు, జన సముహం లాంటివి పూర్తిగా నిషేధమని తెలి పారు. లౌడ్ స్పీకర్లు, డీజేలు వంటివి నిషేదమని తెలిపారు. ప్రచార రథాలు, మైకులు, తదితర అధిక శబ్ద పరికరాలు నిషేధిం చామని తెలిపారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ఆర్ఎస్ఎస్ పథసంచలన్‌లో పాల్గొనాలి

కౌటాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవం సందర్భంగా పథసంచలన్ కార్యక్రమం నిర్వహించనున్నామని, పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆర్ఎస్ఎస్ మండల ప్రముఖ్ ఎల్ములె దత్తు పాండురంగ తెలిపారు. ఈ సందర్భంగా తలోడి ప్రభుత్వ పాఠశాల నుంచి కౌటాల బస్టాండు మీదుగా భారతి విద్యామందిర్ వరకు పథసంచలన్ నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు నోటుబుక్కుల పంపిణీ



విద్యార్థులకు ఎస్సై అందజేసిన నోట్బుబుక్కులు

కౌటాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోలీసు మీ కోసం కార్యక్రమంలో భాగంగా కౌటాల పోలీసు స్టేషన్ పరిధిలోని గుండాయిపేట, గుడ్లబోరి, తుమ్మిడిహెట్టి ప్రభుత్వ పాఠశాలలోని 1,500 మంది విద్యార్థులకు హెల్పింగ్ సొసైటీ ఫౌండేషన్ సహకారంతో ఎస్సై చంద్రశేఖర్ నోట్ బుక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పోలీసు శాఖ సమాజానికి సేవ చేయడం, గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో విద్యాపై ఆసక్తి పెంపొందించడం, ప్రజలతో పోలీసుల మధ్య అనుబంధాన్ని బలపర్చడం జరుగుతుందన్నారు. సేవా కార్యక్రమానికి సహక రించిన హెల్పింగ్ సొసైటీ ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు విశ్వనాథ్, ఉమేష్, అఫ్జల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దాడిని ఖండిస్తున్నాం

ఆసిఫాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు కేశవరావు అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఆత్మగౌరవ ప్రదర్శన ర్యాలీకి ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు కేశవరావు ఆధ్వర్యంలో జిల్లాలోని ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు అంజన్న, సత్యనారాయణ, శంకర్, మహేష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణి కుటుంబాన్ని ఆదుకోవాలి



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

కాగజ్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హత్యకు గురైన దహెగాం మండలం గెర్రె గ్రామానికి చెందిన గర్భిణి శ్రావణి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. స్థానిక యాదవ సంఘ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడారు. కుల అహంకారంతో గిరిజన కుటుంబానికి చెందిన శ్రావణిని హత్య చేయడం దారుణమన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. శ్రావణి కుటుంబానికి వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత కుటుంబానికి రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వినోద, అనిత, కోశాధికారి షాహిన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలే సాయికృష్ణ, నాగేశ్వరరావు, ఇమాముద్దీన్, ఏసు కుమార, త్రిమూర్తి, సుధాకర్, జయదేవ్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

తేమతో సంబంధం లేకుండా పత్తి కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న కోలాం సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిడాం భీంరావు

కెరమెరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తేమతో సంబంధం లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని కోలాం సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిడాం భీంరావు డిమాండ్ చేశారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది అధిక వర్షాలు కురుస్తున్నందున తేమ పేరుతో కోత విధించవద్దని అన్నారు. తేమతో సంబంధం లేకుండా అధికారులు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భరత్ భూషణ్, యశ్వంత్‌రావు, ఆనంద్, యదో రావు, భీంరావు, టి.భీంరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన

దహెగాం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన దహెగాం మండలం చిన్నరాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులను శనివారం ప్రధానోపాధ్యాయురాలు సునీత, పీడీ రవి అభినందించారు. ఈసుగాంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 జోనల్ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటి బాలురు, బాలికల విభాగంలో కార్తీక్, అంజలి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరు నవంబరు 3, 4, 5 తేదీల్లో వికారాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలని సూచించారు.

కాగజ్‌నగర్ టౌన్, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీలకు కాగజ్‌నగర్ మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థి ఎంపికవడంతో శనివారం పలువురు అభినందించారు. కాగజ్‌నగర్ మండలంలోని నజ్రూల్ నగర్ పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో పలు జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో మైనారిటీ గురుకుల విద్యార్థులు ఇద్దరు పాల్గొన్నారు. పోటీల్లో ఎనిమిదో తరగతికి చెందిన నవీన్ కుమార్ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 3, 4 తేదీల్లో వికారాబాద్‌లో నిర్వహించనున్న పోటీలలో ఎంపికయిన జట్ల పోటీలు నిర్వహిస్తారని పీఈటీలు తెలిపారు. నవీన్‌కుమార్‌ను ప్రిన్సిపాల్ రోమి ప్రతిభ పీఈటీలు రాజశేఖర్, చిరంజీవి అభినందించారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రేపు సమన్వయ సమావేశం

ఆసిఫాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజీమార్గన కేసుల పరిష్కారం కోసం ఈ నెల 15న తలపెట్టిన ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహణపై సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయ స్థానం భవనంలో పోలీసు శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించనున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్, విద్యుత్, బ్యాంకింగ్, భూములు, వివాహ, కుటుంబ కలహాలు, మోటారు వాహనాల ప్రమాదాలు, ఎన్ఐ యాక్ట్, చిట్ ఫండ్, చెక్ బౌన్స్ తదితర కాంపౌండుల్ కేసులను ప్రత్యేక లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు.

నేడు బీసీ జేఏసీ ..

ఆసిఫాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ కళంగభవన్‌లో ఆదివారం బీసీ జేఏసీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నా మని జేఏసీ చైర్మన్ రూప్‌నార్ రమేశ్ అన్నారు. స్థానికంగా శనివారం నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ జేఏసీ ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నామని తెలిపారు. సమావేశంలో ప్రణయ్, వెంకన్న, ప్రశాంత్, సాయికృష్ణ పాల్గొన్నారు.

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం

● పగిలిన టైల్స్.. ఇబ్బందులు పడుతున్న సిబ్బంది ● మరమ్మతులు చేపట్టాలని వినతి



శిథిలావస్థకు చేరుకున్న తహసీల్దార్ కార్యాలయం

బెజ్జూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండి రైతులకు, విద్యార్థులకు వివిద రకాల సేవలు అందిస్తోన్న తహసీల్దార్ కార్యాలయం శథిలావస్థకు చేరడంతో అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోని కింది గచ్చు పూర్తిగా ఊడిపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. గత మూడేళ్ల నుంచి కింద వేసిన టైల్స్ పూర్తిగా పగిలిపోయి మట్టి బయటకు రావడంతో నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2011లో కుమరం భీం ప్రాజెక్టు భూసేకరణ నిధుల వడ్డీ రూ.17లక్షల వ్యయంతో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పాటు మూడేళ్ల నుంచి టైల్స్ పూర్తిగా చెడిపోవడంతో అధి కారులు మరమ్మతులు చేయకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. మరమ్మతుల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపినా నిధులు మంజూరు కావడం లేదని అధికారులు వాపోతున్నారు. కార్యాల యానికి వివిద పనుల కోసం వచ్చే ప్రజలు, అధికారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పైనుంచి వర్షపు నీరు కూడా ఊరుస్తుండడంతో కంప్యూటర్లు, వివిద రకాల దస్త్రాలు తడిచిపోతు న్నాయని సిబ్బంది వాపోతున్నారు. ప్రతినిత్యం వివిద రకాల సమస్యల కోసం వచ్చే రైతులు, ఇతరులతో కార్యాలయం సందడిగా ఉండే తహసీల్దార్ కార్యాల యం మరమ్మత్తులు చేపట్టేందుకు ఎవ్వరూ పట్టించుకోవడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు.



పగిలిపోయిన టైల్స్

నిధులు మంజూరైనా..

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మరుగుదొడ్ల నిర్మాణానికి గత నాలుగు నెలల క్రితం ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.2.50లక్షలు మంజూరైనా ఇప్పటికీ పనులను చేపట్టడం లేదు. కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులకు అవస్థలు తప్పడం లేదు. గతంలో నిర్మించిన మరుగుదొడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కార్యాల యానికి వివిధ పనుల కోసం వచ్చే మహిళలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.